నేడు ట్రిపుల్‌ఐటీ స్నాతకోత్సవం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 24వ స్నాతకోత్సవంను శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ శాంతిసరోవర్ క్యాంపస్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొంటారు.

చందానగర్ సర్కిల్- 21 డీసీగా శశిరేఖ



చందానగర్: చందానగర్ సర్కిల్ -21 ఉపకమిషనర్ పి.మోహన్ రెడ్డి పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కార్వాన్ ఉపకమిషనర్ డి.శశిరేఖ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మోహన్‌రెడ్డి స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొంది జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ శానిటేషన్ -1 (చార్మినార్, సికింద్రాబాద్, ఎల్బీనగర్)కు వెళ్లారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 35, పచ్చిమిర్చి 60 , బెండ 55, కాకర 50, దొండ 50, దోస 30, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 50, గోకర 60, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 80.

బసవతారకనగర్‌వాసులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి

మాజీ స్పీకర్ మధుసూదనాచారి



బసవతారకనగర్‌లో పర్యటిస్తున్న మధుసూదనాచారి, ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్

రాయదుర్గం: బసవతారకనగర్‌వాసులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని బసవతారకనగర్‌లో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో శుక్రవారం స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అధికారంలో వచ్చాక నిరుపేదలు, శ్రమజీవులను నిలువనీడ లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. గుడిసెలు కోల్పోయిన వారికి పక్కా ఇళ్ళు నిర్మాణం చేయించి వారికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కూల్చివేతలకు పాల్పడుతుందన్నారు. పక్కా ఇళ్ళు నిర్మించి ఇచ్చే వరకు వారి కోసం పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా, బీఆర్‌ఎస్ నాయకులు పల్లె రవికుమార్, కొమిరిశెట్టి సాయిబాబా, హరీష్‌రావు, జంగయ్య యాదవ్, అనిల్‌సింగ్, రాజుముదిరాజ్, పరమేష్, అంజమ్మ, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్



గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులతో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి: వన మహోత్సవంలో అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్‌లోని శిల్పా గార్డెన్‌లో ఆయన డీసీ ప్రశాంతి, చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. చెట్ల యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్లకార్డులతో మొక్కల ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూబీడీ డీడీ అమృత, మేనేజర్ యూసుఫ్, బస్తీ అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, హరికుమార్‌రెడ్డి, గోపాల్, గణేష్, సురేంద్ర, రామ్‌కిషోర్, సురేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మియాపూర్ : ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగిరాని సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ పర్వీద్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని న్యూ హఫీజ్‌పేటలోని మార్తాండనగర్ కాలనీలో పార్థసారధి (37) కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. ఫైనాన్షియల్ కొటక్ మహీంద్రలో ఉద్యోగం చేస్తున్నాడు.ఈ నెల 2వ తేదిన సాయంత్రం 7.30 గంటల సమయంలో ముంబాయి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రోజులు గడుస్తున్నా తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని తెలిపారు. కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భార్య దేవి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మియాపూర్ : గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మెట్రోస్టేషన్‌లో ఖాళీగా ఉన్న షెటర్స్ వద్ద ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని శుక్రవారం మధ్యాహ్నం మియాపూర్ మెట్రో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. ఇక్కడ చుట్టుపక్కల భిక్షాటన చేసే వాడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

ఎఫ్‌డీడీఐ ఈడీ డా. తేజ్‌లోహిత్‌రెడ్డి



రాయదుర్గం దాబా కూడలి రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎఫ్‌డీడీఐ విద్యార్థులు

రాయదుర్గం: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడంతో బాటు విధిగా పాటించాలని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్ లోహిత్‌రెడ్డి సూచించారు. రాయదుర్గంలో ఎఫ్‌డీడీఐ, ట్రాఫిక్ పోలీసుల సంయుక్తాధ్వర్యంలో 'ట్రాఫిక్ అవేర్‌నెస్' పేరిట అవగాహనా ర్యాలీ, ప్లకార్డులతో వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారు హెల్మెట్‌ను, కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్టులను విధిగా ధరించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గణేష్‌పాటిల్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ క్యాంపస్ నుంచి ప్లకార్డులతో విద్యార్థులు ర్యాలీగా మల్కంచెరువు వద్ద చేరుకున్నారు. అనంతరం అక్కడ రోడ్డు నిబంధనలు పాటిస్తామని, హెల్మెట్ ధరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తేజ్‌లోహిత్‌రెడ్డి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు, రహమాన్, ఫియాజీ, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

మసీద్‌బండలో రోడ్ సేఫ్టీ డ్రైవ్



రోడ్డుపై గుంతను బీటీతో పూడ్చుతున్న దృశ్యం

గచ్చిబౌలి: రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు రోడ్ సేఫ్టీ డ్రైవ్‌ను ప్రారంభించారు. శుక్రవారం మసీద్‌బండలో రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతను బీటీతో పూడ్చారు. రోడ్ సేఫ్టీ డ్రైవ్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ ఆనంద్, ఏఈ భాస్కర్ పాల్గొన్నారు. ఈ డ్రైవ్ ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గుతుందని కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ పేర్కొన్నారు.

నూతన కాలనీల అభివృద్ధికి నిధులు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరు డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీ, ఆల్విన్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నందన్ రతన్‌ప్రైడ్ కాలనీలలో సీసీ రోడ్లు, యాదవ సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, ముదిరాజ్ సంఘం స్మశాన వాటికలలో రూ. రెండు కోట్ల 51 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నూతన కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. అలాగే పట్టణంలో సీసీ రోడ్లు, యుజీడీలు నిర్మిస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, న్యాయవాది నాగరాజు యాదవ్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన అష్టపది

- శిల్పారామంలో గురుపౌర్ణమి
- మూడురోజుల పాటు వేడుకలు



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో గురుపౌర్ణమి ఉత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్, సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ శిష్య ప్రశిష్యుల ప్రముఖ నాట్యగురువులు పద్మకళ్యాణ్ ఆచార్య అభివందన కార్యక్రమం సమర్పించారు. ఇందులో శృంగార లహరి, మధుర మధుర, బాల కనకమయి, గణేశపంచరత్న, దశావతారం, అష్టపది, మూషికవాహన, వినరో భాగ్యము, మండూక శబ్దం, హిందోళ తిల్లాన అంశాలను డాక్టర్ కిరణ్మయి బోనాల, సంచలన, సమ్మోహన, మైథిలి, లహరి, ఉమామహేశ్వరీ, రశ్మిత, జానకి, తన్మయి, గాయత్రి, వైష్ణవి, హేమలత, లక్ష్మిప్రియ పాల్గొన్నారు. అనంతరం గురు సత్కారం చేశారు.